క్లుప్తంగా

పెద్దమ్మా... దీవించమ్మా



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొనసాగుతున్న తిక్కస్వామి ఉరుసు



ప్రత్యేక అలంకరణలో తిక్కస్వామి సమాధి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సాయిబాబానగర్‌లో వెలసిన తిక్కస్వామి దర్గాలో నాల్గవ రోజు ఆదివారం ఉరుసు వేడుకలు కొనసాగాయి. మొక్కులు తీర్చుకోవడంలో భాగంగా భక్తులు ఫాతేహాలు, చాదర్లు సమర్పించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి ఖవ్వాలి నిర్వహించారు.

రైతులకు అందుబాటులో యూరియా

గోస్పాడు: మండలంలోని గ్రామాల్లో రైతులకు యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రైవేటు దుకాణాల్లో యూరియా 42 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. గోస్పాడులోని వెంకటసాయి ఫర్టిలైజర్స్‌లో 30టన్నులు, శ్రీకర ఫర్టిలైజర్స్‌లో 12టన్నులు ఉందన్నారు. అలాగే యాళ్లూరు, ఎం.కృష్ణాపురం, నెహ్రూనగర్, సాంబవరం రైతు సేవా కేంద్రాల్లో కూడా యూరియా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మండలంలోని రైతులు వారి ఆధార్ కార్డు వెంట తీసుకోవడంతో పాటు రైతులు సాగు చేసిన పంట ఆధారంగా యూరియా ఎమ్మార్పీ ధరకే విక్రయించేలా జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు స్థానిక వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ఎరువుల డీలర్లు రైతులకు యూరియాను అందజేసేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

నేడు బ్యాంకర్లతో సమావేశం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పురపాలక సంఘం, జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ నంద్యాల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకాలపై సోమవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారికి 2024–25 వార్షిక ప్రణాళికలో కేటాయించిన లక్ష్యాల సాధనకు బ్యాంకుల అధికారులతో చర్చిస్తామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

నంద్యాల(అర్బన్): అనర్థాలకు కారణమవుతున్న ప్లాస్టిక్‌ను తక్షణమే నిషేధించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని బీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చింతలపల్లె సుధాకర్‌రావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలు, ఇలా ప్రతి చోట ప్లాస్టిక్‌ను విరివిగా వాడుతున్నారన్నారు. అధికారులు తూతూ మంత్రపు దాడులతో సరిపెడుతూ ప్రజలను అనారోగ్యాల పాలు చేస్తున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్లాస్టిక్ హోల్‌సెల్ అమ్మకాలు జోరుగా సాగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కృషి



మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకే నిధులు విడుదల చేస్తోందని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. ఆదివారం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పాడి పంటలకు ఆదర్శ గ్రామం యాళ్లూరు అన్నారు.

సంగమేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు

కొత్తపల్లి: సప్తనది సంగమేశ్వరం ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉమామహేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈఓ రామలింగారెడ్డి, పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. చలువ పందిళ్లు, క్యూలైన్లు వంటి పనులు చేపట్టారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 849 అడుగులు ఉందని, మరో 11 అడుగులు తగ్గితే ప్రాచీన సంగమేశ్వరాలయం పూర్తిగా బయటపడుతుందని వెల్లడించారు.

అంగన్‌వాడీలకు ‘జ్ఞానజ్యోతి’

- అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ
- 3 శాఖల ఆధ్వర్యంలో తరగతులు
- మారనున్న అంగన్‌వాడీ చదువులు
- ప్రారంభమైన మొదటి విడత శిక్షణ



శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేలా జ్ఞాన జ్యోతి వెలుగులతో చదువులు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. 3 – 5 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా జ్ఞాన జ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలో 42 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 0 –3 సంవత్సరాల్లో చిన్నారులు 1,422 మంది చిన్నారులు, 3 – 6ఏళ్ల లోపు చిన్నారులు 916, ప్రీ స్కూల్ చిన్నారులు 644 మంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పటిష్టమైన పునాదులు..

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయస్సు కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ వయస్సు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0–6 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్‌కు దిక్సూచిగా నిలువాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు పెంపొందించడంతో పాటు, ప్రతీ కేంద్రానికి ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

18 నుంచి కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ..

మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా వీరికి మెలకువలు నేర్పిస్తున్నారు. మండలంలోని 776 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొంటున్నారు. మండలంలోని 42 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ గురువారంతో మొదటి దశ ముగిసింది. మళ్లీ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు రెండో దశ శిక్షణ నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధన నైపుణ్యతను పెంపొందించడమే లక్ష్యంగా సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 120 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఆటల ద్వారా అభ్యాసం, ఈ శిక్షణ లక్ష్యాల్లో ఒకటి. 5 అభివృద్ధి అంశాలను ఆటల ఆధారంగా బోధించడంపై శిక్షణ ఇస్తున్నారు.

లక్ష్యాలు..

- పూర్వ ప్రాథమిక విద్య, పునాది అభ్యసన కొనసాగింపు కోసం రోడ్ మ్యాప్ అభివృద్ధి చేయడం.
- పిల్లల బాల్యారంభ సంరక్షణ,అభివృద్ధే కార్య క్రమం లక్ష్యం.
- శారీరక అభివృద్ధి, సామాజిక భావోద్వేగ, నైతి క అభివృద్ధి, మేధాభివృద్ధి, భాష, అక్షరాస్యత అభివృద్ధి, సౌందర్య, సాంస్కృతిక అభివృద్ధి అంశాలపై ప్రామాణికంగా భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా శిక్షణ కొనసాగిస్తున్నారు.
- అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు, 1–2 తరగతు ల ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించడంలో భాగంగా వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం.
- మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, వాటికి అనుసంధానంగా ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయడం.

శిక్షణ ఉపయోగకరం



నూతన విధానంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఎలా బోధించాలనే దానిపై శిక్షణ ద్వారా సిబ్బందికి తెలియజేస్తున్నారు. ఆటపాటలతో బోధన ద్వారా పిల్లలకు త్వరగా అర్థమవుతుంది. పిల్లల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడ నుంచే స్కూళ్లకు వస్తారు. అందుకనే ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్య తతో కూడిన చదువులు అందించేందుకు ఇలాంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరం.

–విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, గోస్పాడు

పకడ్బందీగా శిక్షణ తరగతులు



జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై ప్రత్యేక దృష్టితో చర్యలు చేపట్టాం. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ ప్రోగ్రాంలో భాగంగా ఇప్పటికే 1, 2వ తరగతులు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ అందిస్తున్నాం. శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఇందుకోసం ఐసీడీఎస్, విద్యాశాఖ సంయుక్తంగా భాగస్వాములవుతున్నాం.

– అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు

వైభవం.. అశ్వర్థనారాయణస్వామి కల్యాణం



రావిచెట్టుకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రోజాకుంటలో వెలసిన శ్రీగణపతి నాగలింగేశ్వరస్వామి దేవస్థానం నందు మాఘమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకొని ఆలయంలో రావిచెట్టుకు అశ్వర్థనారాయణస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రావిచెట్టుకు ప్రత్యేకంగా అలంకరించి స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పెళ్లిపెద్దలుగా బైసాని శ్రీనివాసులు, శ్రీదేవి దంపతులు, కటకం రఘువీర్, సుజాత దంపతులు వ్యవహరించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు అన్నదానం చేశారు.

సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ విజయవంతం



పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని సర్వజ్ఞ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 11వ రాష్ట్రస్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ పరీక్షను విజయవంతం చేసినట్లు ఈ అబ్యాస్ ప్రతినిధి రీజనల్ మేనేజర్ హరినాథ్, కరస్పాండెంట్ నాగభూపాల్ రెడ్డి, సులోచన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 275 పాఠశాలల విద్యార్థుల కోసం పది సంవత్సరాలుగా కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 11వ కేసాట్ ఒలింపియాడ్ మొదటి స్థాయి పరీక్షను 57వేల మంది విద్యార్థులు రాశారన్నారు. రాష్ట్రస్థాయి పరీక్షకు 17,500 మంది విద్యార్థులు 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఈ అబ్యాస్ అకాడమీ సీఈఓ డాక్టర్ భువగిరి పవన్ తెలిపారు. 8 పాఠశాలల నుంచి 212 మంది విద్యార్థులు సర్వజ్ఞ హైస్కూల్‌లో జరిగిన పరీక్షకు హాజరైనట్లు ఆదివారం తెలిపారు. రాష్ట్రస్థాయిలో తరగతుల వారీగా 123 ర్యాంకులు సాధించిన వారికి ఏప్రిల్ 13న గుంటూరులో జరిగే 11వ అభ్యాసోత్సవ్ అవార్డుతో పాటు మెమొంటోలు, నగదు బహుమతులు ప్రోత్సాహక్ ఒలింపియాడ్ కిట్లు అందజేస్తామని వివరించారు.


కొనసాగుతున్న పార్వేట ఉత్సవాలు



రుద్రవరంలో పూజలందుకున్న ఉత్సవమూర్తులు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వామి వారి పల్లకీ బలిజ కాలనీ నుంచి పడమటి వీధి, బొరుగుల పేటలోని తెలుపుల మీద కొలువుదీరగా ఆయా కాలనీల ప్రజలు భక్తిశ్రద్ధలతో కాయా కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామివారి పల్లకీ సత్యనారాయణ స్వామి ఆలయ తెరుపు మీద కొలువుదీరి.. అక్కడే బస చేశారు. స్వామి వారి పల్లకీ రాకతో రుద్రవరంలో తిరునాల వాతావరణం నెలకొంది. గ్రామంలోని ప్రతి కుటుంబం బంధువులతో కళకలాడుతోంది.

మహానందికి బయలుదేరిన పెళ్లి పెద్ద



మహానందికి తరలివెళ్తున్న శ్రీ గంగ, పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వర స్వామి

నంద్యాల(వ్యవసాయం): మహానంది బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శివరాత్రి రోజు జరిగే కల్యాణానికి ఆహ్వానంగా వచ్చిన శ్రీకామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామి వారితో పెళ్లి పెద్ద అయిన శ్రీ గంగ, పార్వతీ సమేత బ్రహ్మనందీశ్వరస్వామి ఆదివారం మహానందికి బయలుదేరారు. ఈ సందర్భంగా బ్రహ్మనందీశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవమూర్తులకు ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో ఊరేగించారు. ఊరేగింపు గాంధీ చౌక్, కల్పనాసెంటర్, బైటి పేట ఆంజనేయస్వామి దేవస్థానం, పప్పుల బట్టి బజారుగుండా మహానందికి బయలుదేరారు. కల్పనా సెంటర్‌లోని శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమం వారు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు మహానంది దేవస్థాన సిబ్బందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు కిరణ్, వేణు గోపాల్, మాజీ కౌన్సిల్ కత్తి శంకర్, చక్రపాణి, ఖాతా ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కేఆర్ఎంబీ నిరసన ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 25వ తేదీన నంద్యాల పట్టణంలో నిర్వహించే ర్యాలీలో ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బాలాజీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లోని వాణిజ్య వర్గాలు, ప్రజలకు కేఆర్ఎంబీ ఆవశ్యకతను వివరించారు. కర్నూలులో ఏర్పాటు చేయడం ద్వారా నది జలాల పంపిణీ సక్రమంగా జరిగి రాయలసీమ ప్రాంతంలోని రిజర్వాయర్లు నిండుకుండలా ఉంటాయన్నారు. దీని ద్వారా రైతాంగానికి సరైన సమయంలో నీరు సాగునీరు అందించవచ్చన్నారు. నీటి లభ్యతను బట్టి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి, తాగునీటి సమస్యలు తీరుతాయన్నారు. కూటమి ప్రభుత్వం కేఆర్ఎంబీని విజయవాడలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడాన్ని రద్దు పరిచి కర్నూలులో ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. సమితి ఉపాధ్యక్షులు వైఎస్ రెడ్డి, కాశింమియా, మహబూబ్‌బాషా, సుధాకర్‌రావు పాల్గొన్నారు.



ఆలయంలో నిర్మించిన కళ్యాణ మండపం



రాతితో కట్టిన ఆలయ ప్రవేశ ద్వారం

మహాశివరాత్రికి బుగ్గమల్లేశ్వర క్షేత్రం ముస్తాబు

- వందల ఏళ్ల నాటి బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయం
- సువిశాలమైన, ప్రశాంత వాతవరణంలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు
- జాగరణ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు



ముస్తాబైన బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానం

చాగలమర్రి : మండల కేంద్రానికి కూత వేటు దూరంలో వెలసిన బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యింది. ఈనెల 26న మహాశివరాత్రిని దేవస్థానం కమిటీ ఆధ్వర్యం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

వందేల ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం

వందల ఏళ్లక్రితం బుగ్గమల్లేశ్వరస్వామి క్షేత్రం ఉన్న ప్రాంతంలో బ్రాహ్మణపురం అనే గ్రామం ఉండేదని, గ్రామంలో కొన్ని బ్రాహ్మణకుటుంబాలు నివాసం ఉండేవని, వారి కాలంలోని ఈ క్షేతం వెలిసినట్లు పూర్వికుల కథనం. కాలక్రమేణ బ్రాహ్మణులు జీవనోపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెల్లాయని, వారి నివాస ఆనవాళ్లుగా ఈ క్షేత్రం నిలిచినట్లు కథనం ప్రచారంలో ఉంది. సువిశాలమైన, ప్రశాంతమైన వాతవరణంలో బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానం వెలిసింది. దేవస్థానంలోని గర్భగుడిలో అతిపురాతనమై శివలింగం ప్రతిష్టించారు. అంతేకాకుండా గర్భగుడికి ఇరువైపులా వేణుగోపాలస్వామి, రుక్మిణిదేవి ఆలయాలను నిర్మించారు. గర్భగుడికి ఎదురుగా వివాహాది శుభకార్యాలకు, యజ్ఞయాగాది, కళ్యాణ క్రతువులు నిర్వహించుకునేందుకు రాయితో నిర్మించబడిన అతి పురాతనమైన మండపాలు, సకల సౌకర్యాలతో నిర్మించిన కళ్యాణ మండపం ఇప్పటికి చెక్కుచెదరకుండా పూరికుల కళా నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచాయి.

తాగునీటి సౌకర్యం.. అన్నదానం

తాగునీటి సౌకర్యం కోసం దేవస్థానం ఆవరణలోనే రాతి కటకంతో నిర్మించిన ఒక చిన్న కోనేరు, అదే విధంగా దేవస్థానం పక్కనే అవతలి వైపుకు మరో కోనేరు నిర్మించారు. అయితే ప్రస్తుతం రెండు కోనేరుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీరు లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో భక్తుల సౌకర్యార్థం కమిటీ తరుపున ఆర్యవైశ్యులు బోరు బావిని తవ్వించి మోటారును ఏర్పాటు చేసి కోళాయిలను అమర్చారు. దేవస్థానం కమిటీ వారు 1963వ సంవత్సరం నుంచి ఆర్యవైశ్య అన్నదాన సత్రాన్ని ఏర్పాటు, చేసి ప్రతి ఏడాది మహాశివరాత్రి, కార్తీక మాసం, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, తదితర పర్వదినాల సమయంలో భక్తులకు అన్నదాన కార్యక్రం నిర్వహిస్తున్నారు.

ఈ నెల 26న ప్రత్యేక కార్యక్రమాలు

ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తుల జగారానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు బుగ్గమల్లేశ్వర క్షేత్ర ఆర్యవైశ్య అన్నసత్ర కమిటీ క్యాషియర్ కె.వరప్రసాద్ తెలిపారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సంప్రదాయ మంగళవాయిద్యాలతో పార్వతీపరమేశ్వరుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జాగారం సమయంలో ముద్ర డ్యాన్స్ నృత్య అకాడమీకి చెందిన బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద, భరత నాట్యం, కూచిపూడి, శివుని నృత్యములు, కొలాటం, కోయనృత్యం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

నంద్యాల(వ్యవసాయం): వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని ఉప తహసీల్దార్ రవీంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఏపీ వీరశైవ లింగాయత్ ఓబీసీ సాధన సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో బీసీ–డీ కింద ఉన్న వీరశైవ లింగాయత్ కులాన్ని కేంద్రం ఓబీసీ కింద చేర్చాలన్నారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజ సాధన సమితి సభ్యులు వీరభద్రప్ప, మంజునాథ్, సురేష్, విజయ్, శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్టీ పునరుద్ధరణ బిల్లును తీర్మానించాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ బిల్లును అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ ఎమ్మెల్యే బడ్జెట్ సమావేశాల్లో ఎస్టీ పునరుద్ధరణపై ముఖ్యమంత్రితో చర్చించి బిల్లు తీర్మానమయ్యేలా చూడాలన్నారు. నాగేశ్వరరావు, శివనాగేంద్ర, ఓబులేసు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో చోరీలు

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని మూడు దుకాణాల్లో, నందిపల్లె గ్రామంలోని మదార్‌వలి స్వామి దర్గాలో ఒకేరోజు చోరీలు జరిగిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలోని శ్రీనివాసులు, ఫణీంద్ర, వీరారెడ్డి నిర్వహిస్తున్న కిరాణ దుకాణాల్లో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి వస్తువులు, సామగ్రి ఎత్తుకెళ్లారు. దర్గా నిర్వాహకులు శిలార్‌సా ఫిర్యాదు చేశారు.

దీక్ష విరమణకు మాలధారుల పయనం



అహోబిలానికి వెళ్తున్న మాలాధారులు

రుద్రవరం: నృసింహ మాలాధారులు దీక్ష విరమణ కోసం ఆదివారం కాలి నడకన అహోబిలానికి బయలుదేరి వెళ్లారు. జనవరి నెలలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని అహోబిలేశుడి పార్వేట ఉత్సవాలు ప్రారంభమైన రోజున ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల భక్తులు 40 రోజుల దీక్షబూని నరసింహ స్వామి మాల ధరించారు. నాటి నుచి నేటి వరకు నియమ నిబంధనలతో స్వామిని ధ్యానిస్తూ నిత్యం పూజలు చేసేవారు. ప్రస్తుతం దీక్ష గడువు ముగియనుండటంతో విరమించేందుకు ఇరుముడి ధరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కాలి నడకన అహోబిలానికి పయనమయ్యారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జఫ్రుల్లా

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రుల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా తనిఖీ చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై వైద్యులు, పారామెడికల్, నాల్గవ తరగతి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎక్స్–రే, డ్రగ్ స్టోర్, ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్ సరఫరా విభాగాలను పరిశీలించారు.

మల్లన్న, మహానందీశుడికి పట్టవస్త్రాల సమర్పణ



శ్రీశైల మల్లన్నకు విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు వస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ తదితరులు – శ్రీశైలంటెంపుల్



మహానందీశ్వరుడికి సమర్పించేందుకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డికి పట్టువస్త్రాలు అందిస్తున్న కాణిపాకం ఆలయ ఈఓ పెంచల కిశోర్ – మహానంది